క్లుప్తంగా

వైభవంగా తిరుమంజనం



తిరుమంజనంలో పాల్గొన్న ఆలయ అర్చకులు, సిబ్బంది

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ శుద్ధి, కోయల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 30న ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం సాంప్రదాయం ప్రకారం ముందుగా వచ్చే మంగళవారం ఈ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ మేరకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయాన్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో జగన్‌మోహనాచార్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ముగిసిన పౌర్ణమి ఉత్సవాలు



ఇస్కాన్‌లో పూజలు చేస్తున్న దృశ్యం

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పౌర్ణమి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీరాధాకృష్ణులను, సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పుష్పాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం



పుష్పాలంకరణలో శ్రీవారు

భీమునిపట్నం: భీమిలి కృష్ణా కాలనీ కొండపై నున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అప్పలాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, మహానివేదన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, రేలంగి పెదబాబు, కె.ముత్యాలరావు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆనందపురం : మండలంలోని రేగానిగూడేనికి సమీపంలోని మామిడితోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సీహెచ్.జి.వి.ప్రసాదరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగానిగూడేనికి సమీపంలో గల దట్టమైన మామిడితోటలో కొంత కాలంగా మాజీ రౌడీషీటర్ కోరాడ గౌరినాయుడు పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సీఐ మల్లేశ్వరరావు, సిబ్బంది ఆకస్మిక దాడి చేశారు. ఈ మేరకు పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్న కోరాడ గౌరినాయుడుతోపాటు మరో నలుగురిని పట్టుకున్నారు.రూ.18 వేలు నగదు, కారు, నాలుగు బైక్‌లు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులు ఆనందపురం పోలీసులకు అప్పగించారు.

టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం

- నేటికీ అభ్యర్థిని ప్రకటించని చంద్రబాబు
- రోజుకో పేరుతో సర్వే చేయిస్తున్న అధిష్టానం
- రాజబాబుకు మొండి చేయితో మండిపడుతున్న ఆ వర్గం
- 'గంట' మోగుతుందన్న ఆశలో అతని మద్దతుదారులు



కొద్ది రోజుల కిందట చంద్రబాబు, రాజబాబు ఫొటోలతో టీడీపీ ప్రచార వాహనం



రాజబాబు పేరు ప్రకటించకపోవడంతో టీడీపీ స్టిక్కర్లు తొలగించిన తర్వాత వాహనం

తగరపువలస : రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల హంగామా నెలకొంటే... టీడీపీ భీమిలి శ్రేణుల్లో మాత్రం నైరాశ్యం అలుముకుంది. మే 13న ఎన్నిక జరగనుండగా... ఇప్పటికీ టీడీపీ అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడి 12 రోజులు గడిచినా అధినేత చంద్రబాబు అభ్యర్థిని ప్రకటించకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడుతున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నాలుగేళ్లు పనిచేసిన కోరాడ రాజబాబును కాదని తెరపైకి నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి కర్రోతు బంగార్రాజు, గీతం చైర్మన్ భరత్, ఉత్తర నియోజకవర్గం నుంచి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి నుంచి దిలీప్ చక్రవర్తి పేర్లను బాబు ప్రచారంలోకి తీసుకురావడంతో విస్మయానికి గురవుతున్నారు. రాజబాబు నుంచి వీరందరి వరకు ఎవరి పేరు మీద కూడా నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులకు ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పేర్లు మార్చి ఐవీఆర్ఎస్ సర్వే పేరుతో ప్రయోగాలు చేస్తున్నారు. అయినప్పటికీ ఇక్కడ పోటీ చేసే అభ్యర్థిపై అధిష్టానం ఒక కొలిక్కి రాకపోడంతో కేడర్ నీరు గారిపోతున్నారు.

సోషల్ మీడియాలో గ్రూపుల గోల

1983 నుంచి 2004 వరకు టీడీపీకి కంచుకోటగా ఉన్న భీమిలి నియోజకవర్గంలో మొదటిసారిగా ఈ ఎన్నికల్లో అభ్యర్థి పేరు ఖరారు కాకపోవడం ఇక్కడి కార్యకర్తలకు మింగుడు పడటం లేదు. సోషల్ మీడియా వేదికగా స్థానిక అభ్యర్థి, నాలుగేళ్లుగా పార్టీని బతికించిన కోరాడ రాజబాబుకే భీమిలి టికెట్ ఇవ్వాలని కోరుతూ ఆ పార్టీకే చెందిన రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు అధిష్టానాన్ని ఎండగడుతున్నారు. ఇదిలా ఉండగా గంటా శ్రీనివాసరావు వర్గంగా పేరుపొందిన నియోజకవర్గంలోని అయిదుగురు కార్పొరేటర్లు ''అదిగో గంటా వస్తున్నారు... ఇదిగో గంటా వస్తున్నారు...'' అంటూ ఊరట చెందుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేంత ఖర్చు రాజబాబు భరించలేడని ఒక పక్క ప్రచారం జరుగుతుండగానే గంటా శ్రీనివాసరావుకు కూడా ఆర్థిక ఇబ్బందులు వున్నాయని అంటున్నారు.

ఓటమి భయంతో వెనుకడుగు..!!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భీమిలి నియోజకవర్గంలో సంక్షేమ పథకాల కోసం రూ.2 వేల కోట్లు, అభివృద్ధి కోసం రూ.2500 కోట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సారథ్యంలో ఖర్చు చేశారు. ఈ పరిస్థితిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై పోటీ చేసి గెలవడం అసాధ్యమని టీడీపీ నాయకుల్లో తీవ్ర నైరాశ్యం అలుముకుంది.

ఈ కారణంగానే టీడీపీ అధిష్టానంతోపాటు పోటీలో అభ్యర్థులుగా వుంటారని భావించిన వారు సైతం వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీలో తమకు భవిష్యత్ వుండదని భావిస్తున్న నాయకులు, కార్యకర్తలు తలో పార్టీ చూసుకుని చేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే జరిగితే ఈ ఎన్నికల తర్వాత భీమిలిలో టీడీపీ కనుమరుగు కావడం ఖాయమంటున్నారు.

బుద్ధి తక్కువ సన్నాసులంటూ సెటైర్లు..

భీమిలిలో టీడీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. వారు సోషల్ మీడియాలో చేసుకుంటున్న విమర్శలను ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి అభ్యర్థులకు అధిష్టానం చంద్రబాబు అయినట్టే, గ్రామ స్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థుల బాగోగులు చూసుకునే ఎమ్మెల్యే అభ్యర్థి లేదా ఎమ్మెల్యేయే అధిష్టానం అవుతుందని ఆ పార్టీలోని కొందరు నాయకులు చిలక పలుకులు పలుకుతున్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులు మరొకరిని తమకు పోటీగా టికెట్ కోసం రానివ్వనట్టే... నియోజకవర్గ స్థాయిలో కూడా అప్పటికప్పుడు ఎన్నికల సమయంలో ఎవరినీ రానీయవద్దని దుమ్మెత్తిపోసుకుంటున్నారు. గ్రామ స్థాయిలో కష్టపడిన వారి మనోభావాలు శిరోధార్యంగా భావించినట్టే... నియోజకవర్గ స్థాయిలో కష్టపడి పనిచేసిన వారికీ ఇవే మాటలు వర్తిస్తాయంటున్నారు. కానీ టీడీపీలో మాత్రం కష్టపడి పనిచేసే నాయకులకు ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీకి అవకాశం ఇవ్వకుండా... పార్టీ ఫండ్ పేరుతో కోట్లాది రూపాయల మూటలు ఇచ్చిన వారి పేరుమీదే సర్వే చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే తిట్టిపోస్తున్నారు. ఎవడో పెళ్లి చేసుకుని కన్న పిల్లలను ముద్దాడినట్టు వ్యవహారం భీమిలి టీడీపీలో నడుస్తోందని సెటైర్లు వేసుకుంటున్నారు. ఇలాంటి నీతి మాలిన నాయకులపై ఇతరులు ఉమ్మి వేస్తారని ఘాటు వ్యాఖ్యలు చేసుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం



వాంబే కాలనీలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు

- అందుబాటులో వున్నవారికే పట్టం కట్టండి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ కాలనీ అభివృద్ధి కోసం తాను కోట్లాది రూపాయలు ఖర్చు చేశానన్నారు. యూపీహెచ్‌సీ, పార్కులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, తదితర అభివృద్ధి పనుల తోపాటు సునీల్ శర్మ కాలనీ జెడ్పీ హైస్కూల్‌ను ప్రభుత్వం 'నాడు – నేడు' నిధులతో అభివృద్ధి చేసిందన్నారు. ఇలా సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమన్నారు. ఈ విషయంలో ఆయనతో ఎవరూ పోటీ పడలేరన్నారు. ముందుగా మిథిలాపురి వుడా కాలనీ నుంచి వాంబే కాలనీ వరకు భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. వాంబే కాలనీలో నాయకులకు అడుగడుగునా మహిళలు నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, వివిధ విభాగాల నాయకులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, ముదుండి రాజేశ్వరి, పిల్లా సూరిబాబు, కుడితి రామారావు, జగుపల్లి నరేష్, డాక్టర్ కాంతారావు, వేగి రామిరెడ్డి, ఎల్లాజీ, పోలారావు, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో వాహనాల తనిఖీ



డాగ్ స్క్వాడ్‌తో వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఆనందపురం : మండలంలోని భీమిలి క్రాస్ రోడ్డు చెక్ పోస్టు వద్ద మంగళవారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు డాగ్ స్క్వాడ్‌తో వాహనాలు తనిఖీ చేశారు. గంజాయి, అక్రమ మద్యం, ఇతర మత్తు పదార్థాలు, అక్రమంగా నగదు రవాణాను నిరోధించడానికి అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఇటీవల పలు సంఘటనలు చోటు చేసుకున్నందున తనిఖీలు విస్తృతం చేశారు. కార్యక్రమంలో విశాఖ సెబ్ ఏఈలు యు.సుబ్బారావు, రాజులు నాయుడు, భీమిలి సీఐ వి.రామకృష్ణ, ఎస్‌ఐలు పి.చిన్నంనాయుడు, వి.వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



వేరుశనగ కాయల అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు



చీర, గజమాల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి



పైడితల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

తగరపువలస : మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు, రాజవీధి మహిళలు వేరుశనగ కాయలతో అలంకరించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు అందించారు. జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని కొత్తపేటకు చెందిన మాజీ సైనికుడు మేకల శ్రీను, జానకి దంపతులు కొత్త చీర, గజమాలలతో అలంకరించి అమ్మవారికి స్వీట్లతో సారె సమర్పించారు. పోలిపల్లి పైడితల్లమ్మ వార్షిక ఉత్సవాల్లో భాగంగా చిట్టివలస మేకల వారి కళ్లాల్లో అమ్మవారికి భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు.

ఘనంగా ముగ్గురు అమ్మవార్ల అనుపోత్సవం



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఈవో బండారు ప్రసాద్, తదితరులు

తగరపువలస : సంగివలస కొత్తమ్మతల్లి అలియాస్ పోలమాంబ అమ్మవారు అనిపిలిచే ముగ్గురు అమ్మవార్ల అనుపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తుల తాకిడి అధికంగా వుండడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. రాత్రి 9 గంటల వరకు ఆలయ పరిసరాలు భక్తుల తాకిడితో సందడిగా కనిపించాయి. నగరానికి చెందిన శ్రీహరి సేవా సమితి సభ్యులు, భీమిలి పోలీసుల సాయంతో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పరసతో భక్తులు సందడి చేశారు. ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది కోరాడ శ్రీను, తాటికొండ రాంబాబు, అర్చకులు నరసింహమూర్తి, ఏడిద రామకృష్ణ శర్మ, నాగేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పులివేషాలు, నవదుర్గల ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి.

నీలగిరి తోట దగ్ధం

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెంలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో నీలగిరి తోట దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకోవడంతో ప్రమాదం మరింత పెద్దది కాకుండా నివారించగలిగారు. సవరవిల్లి రాంబాబు అనే వ్యక్తి మిందివానిపాలెంలో నీలగిరి తోట సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఈదురు గాలులకు తోటంతా వ్యాపించాయి. ఈ సంఘటనలో సుమారు మూడు ఎకరాల తోట దగ్ధమైంది. సమాచారం అందుకున్న తాళ్లవలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వాహనంతో అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

శిఖర కలశ పునఃప్రతిష్ట ప్రారంభం



కలశ పూజ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

తగరపువలస : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీసీతారామ ఆలయ శిఖర కలశ పునఃప్రతిష్ట వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అర్చకులు సాయంత్రం కలశాలకు పూజలు నిర్వహించారు. వీటిని బుధవారం ఉదయం ప్రతిష్ఠించనున్నారు. అర్చకులు మూలా కల్యాణశర్మ, కొప్పల అప్పారావు, కొప్పల కృష్ణ, తెడ్లాపు చంటి, కొప్పల రమేష్, పోతురాజు, మొండి కృష్ణ, గురునాథ్, మాదాబత్తుల శ్రీరాములు, రంగనాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



దెక్కతిపాలెంలో రెండో వార్డు నాయకుల ఎన్నికల ప్రచారం



శ్రీనగర్‌లో ఒకటో వార్డు నాయకుల ప్రచారం

తగరపువలస : జీవీఎంసీ 1, 2 వార్డుల్లో వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఒకటో వార్డు శ్రీనగర్, రెండో వార్డు దెక్కతిపాలెంలో ప్రచారంలో నాయకులు శిల్లా కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, పందిరి విజయ్, ఉప్పాడ నాగేశ్వరరావు, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, అక్కరమాని చినబాబు, శీరపు శ్రీరాములు, చిల్ల గణేష్‌రెడ్డి, జీరు శ్రీనివాసరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, కొండపు సూరిబాబు, వంశీరెడ్డి, శీరపు నరసింహారావు, మునకాల ఆదినారాయణరెడ్డి, నమ్మి మాధవరావు, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ, పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటు వేద్దాం

కొమ్మాది : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, సంక్షేమ పాలనను కొనసాగించుకుందాం అనే నినాదంతో జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి సోమన్నపాలెం, ఎస్సీ కాలనీలో మంగళవారం ప్రచారం చేశారు. వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అఖండ మెజారిటీతో గెలిపించాలని గడప గడపకు వెళ్లి ఓటర్లను కోరారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, నాయకులు బాడిదబోయిన రాముల్బాడు, వాండ్రాసి సన్యాసిరావు, ఎరుసు అప్పలకొండ రెడ్డి, కోడిబోయిన వరహాలు, వేముల ఈశ్వర్‌రెడ్డి, హరి, నాగోతు సింగన్న తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, నాయకులు

తరల్ ముగింపు పరీక్షల పరిశీలన

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన తరల్ ముగింపు పరీక్షలను జిల్లా కో ఆర్డినేటర్ జె.శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తరల్ పరీక్ష నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. తెలుగు, గణితంలో విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. గత జూలైలో బేస్‌లైన్, నవంబరులో మిడ్‌లైన్ పరీక్షలు నిర్వహించగా ఇప్పుడు ముగింపు పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. సర్వశిక్ష అభియాన్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయురాలు బుగత మల్లిక పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులతో దివీస్ ప్రతినిధులు

తగరపువలస: ఇటీవల ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం, ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీల్లో 90 మంది చిన్నారులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వీరిలో మొదటి మూడు బహుమతులను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు, ఈసీడీ విభాగపు మేనేజర్ ప్రసాద్, సీఎస్ఆర్ విభాగపు ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సిబ్బంది పక్కాగా విధులు నిర్వహించాలని ఎన్నికల నిర్వహణ అధికారి, ఆర్‌డీవో ఎస్. భాస్కరరెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో ఖచ్చితంగా నిబంధనల ప్రకారం వసతులుండాలని సూచించారు. దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఓటు వేయడానికి రాలేని వృద్ధుల కోసం ప్రవేశ పెట్టిన హోం ఓటింగ్ విధానం సరిగ్గా అమలు చేయాలని సూచించారు. 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు రాలేకపోతే వారికి 12డి ఫారం ఇచ్చి వివరాలు నమోదు చేయించాలన్నారు. తద్వారా వారికి ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో ఓటర్ల గుర్తింపు స్లిప్‌లు ప్రతీ ఇంటికీ అందేలా చూసుకోవాలన్నారు.

ఓటరు గుర్తింపు కార్డులుంటే వాటిని కూడా ఇళ్లకు అందివ్వాలన్నారు. ముఖ్యంగా ఎవరైనా ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేస్తే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అందువల్ల ఎవరూ అలా చేయొద్దని సూచించారు. తహసీల్దార్ గోవింద్, బూత్ పరిశీలన అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలను లక్షాధికారులను చేశాం

- మంచి కోసం సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కొత్త కొవ్వాడలో కుమ్మరి దుకాణంలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పాత కొవ్వాడలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం : గత ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజలను లక్షాధికారులను చేశామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భవిష్యత్‌లో ప్రజలకు మరింత మంచి జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. అందుకోసం మరోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అందరూ ఆశీర్వదించాలని కోరారు. పద్మనాభం మండలంలోని కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్య శ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యం అందించినట్టు తెలిపారు. రాష్ట్రం విడిపోవడం వల్ల ఆదాయం లేకపోయినప్పటికీ ఐదేళ్లలో 1.25 కోట్ల మందికి సంక్షేమ పథకాల రూపంలో రూ.3.70 లక్షల కోట్లు అందించామన్నారు. దళారులు, లంచాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ పథకాల లబ్ధి జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లోకి టీడీపీ నాయకులు వచ్చి తప్పుడు హామీలిచ్చి మభ్య పెడతారని, వారి మాటలు నమ్మొద్దని సూచించారు. గంధవరంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధికి రూ.24 కోట్లు వెచ్చించామన్నారు. ప్రజలకు మేలు చేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటర్లు మద్దతివ్వాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖపట్నం ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇళ్లకు, కిరాణా, కుమ్మరి దుకాణాలకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పాలనపై రూపొందించిన కరపత్రాలను అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ రెండు గ్రామాల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, కొవ్వాడ ఎంపీటీసీ సభ్యురాలు బోని రమణమ్మ, గంధవరం సర్పంచ్ జీ.వి. కె.కె.వర్మ, ఎంపీటీసీ సభ్యుడు బి.వి.ఎస్.ఎన్.రాజు, గంధవరం మాజీ సర్పంచ్ అలమండ ఉమామహేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు మాదిరెడ్డి భాస్కరరావు, నెలివాడ స్వామి నాయుడు, పల్లి గోవింద, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, మొకర అప్పలనాయుడు, సిరుగుడి ఆదినారాయణ, మామిడి శివ రామకృష్ణ, చందక శ్రీను, చందక పైడినాయుడు, బోని సన్యాసినాయుడు, కోన రమణ, సీర సూరప్పడు, తాలాడ పద్మనాభం, బూసురోతు అప్పారావు, బేపల గురునాయుడు పాల్గొన్నారు.



దివ్యాంగునికి కరపత్రం అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు